


రూ.4.5 లక్షల ఆదాయం

గడివేముల: మూలపెద్దమ్మ ఆలయానికి ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు హుండీ ద్వారా రూ.4,57,761 ఆదాయం వచ్చింది. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కానుకలను లెక్కించారు.



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన భ్రమరాంబాదేవికి శుక్రవారం అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అలాగే అంకాళమ్మ అమ్మవారికి విశేష పూజలు జరిపారు.



శ్రీశైలంలో 88 టీఎంసీల నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం సాయంత్రం సమయానికి 88.4734 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 853.70 అడుగులకు చేరుకుంది.

న్యూస్‌రీల్

శ్రీమఠంలో బంగారు పల్లకీ సేవ



బంగారు పల్లకీలో బృందావన ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఊరేగించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను గజ వాహనం, చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఊరేగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రీ మఠం అధికారుల చర్యలు తీసుకున్నారు.

ఐదు రోజుల పాటు వర్షం

ఎమ్మిగనూరు రూరల్: ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో నేటి నుంచి ఈనెల 27వ తేదీ వరకు చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ కనెక్షన్ల వేగం పెంచండి

కర్నూలు(రాజ్‌విహార్): జగనన్న కాలనీలకు విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్లు, ఇతర సామాగ్రి సిద్ధంగా ఉన్నాయని, వెంటనే కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయని, వీటి వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూనియస్ లైన్‌మెన్ మొదలు ఏఈలు, ఏడీఈలు, ఈఈలు పనిచేసే ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

- టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశం

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఆప్షన్-3 ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై మండలాధికారులతో సమీక్షించారు. భూ హక్కు పత్రాల పంపిణీ ఓర్వకల్లు, కర్నూలు రూరల్, గూడూరు, పెద్దకడబూరు, కోడుమూరు, సి.బెళగల్ మండలాల్లో పెండింగ్‌లో ఉందని, సోమవారంలోపు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వేలో భాగంగా గ్రౌండ్ టూతింగ్‌లో మంత్రాలయం మండలం చాలా వెనకబడి ఉందని అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తహసీల్దార్, సర్వేయర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్టోబర్ 15 లోపు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదనరావు, సీపీఓ అప్పలకొండ, సమగ్ర శిక్షఅభియాన్ ఏపీసీ వేణుగోపాల్, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ సిద్ధలింగమూర్తి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వక్క పండుతోంది

పంటల సాగులో నూతన ఒరవడి

- ఆలూరు, చిప్పగిరి మండలాల్లో వక్క సాగు మొదలు
- తక్కువ ఖర్చుతో ఎక్కువ నికర ఆదాయం పొందే అవకాశం
- ఐదో ఏడాది నుంచి వక్కలో దిగుబడులు మొదలు
- ఎకరాకు రూ.10 లక్షల వరకు ఆదాయం
- మార్కెటింగ్ సదుపాయాన్ని దృష్టిలో పెట్టుకునే సాగు
- 90 శాతం సబ్సిడీపై సూక్ష్మసేద్యం



జిల్లాలో వక్కసాగు దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): దానిమ్మ.. డ్రాగన్‌ఫ్రూట్.. అంజూర.. ఇలాంటి పండ్లతోటల సాగు కూడా ఇప్పుడు సాధారణమైంది. రైతులు వినూత్న పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. మూడు, నాలుగేళ్ల క్రితం ఒకరిద్దరికే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ సాగు ఇప్పుడు బాగా విస్తరించింది. సరికొత్తగా బనగానపల్లి, మద్దికెర మండలాల్లో ఖర్జూరా సాగు లాభాలు పండిస్తోంది. క్రిష్ణగిరి మండలంలో ద్రాక్ష సాగులో ఉంది. సి.బెళగల్ మండలంలో ఆయిల్‌పామ్ సాగవుతోంది. తాజాగా జిల్లాలో వక్క సాగు మొదలైంది. వక్క లేనిదే శుభకార్యాలు జరుగవు. శుభకార్యాల్లో వక్క ఎంతో కీలకం. నోరుబాగా పండాలంటే వక్క తప్పనిసరి. వక్కను పచ్చిగాను, ప్రాసెసింగ్ చేసిన తర్వాత ఎండు రూపంలోనూ వినియోగిస్తారు. వక్క సాగు ప్రస్తుతానికి చిప్పగిరి, ఆలూరు మండలాల్లో మొదలైంది. కాస్త అవగాహనతో సాగు చేస్తే వక్కలో సిరులు పండించుకోవచ్చనే అభిప్రాయం ఉంది. కర్ణాటకలో వక్కసాగును సంపూర్ణంగా అధ్యయనం చేసిన రైతులు జిల్లాలో సాగుకు శ్రీకారం చుట్టారు. రెండేళ్ల పాటు అంతర పంటలు కూడా సాగు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పెట్టుబడి వ్యయం తక్కువే..

ఐదేళ్లు మొక్కలను కంటికి రెప్పలా కాపాడితే ఆ తర్వాత రైతుకు లాభాల పంటే. మొదటి ఏడాది మాత్రమే కొంతమేర పెట్టుబడి వ్యయం ఉంటుంది. ప్రధానంగా మొక్కల ఖర్చు కాస్త ఎక్కువ. మరుసటి ఏడాది నుంచి పెట్టుబడి వ్యయం నామమాత్రమే. జిల్లాకు చెందిన రైతులు కర్ణాటక రాష్ట్రంలోని పావుగడ నర్సరీ నుంచి మొక్కలు తెచ్చుకొని నాటుకున్నారు. అక్కడ మొక్క ఖరీదు రూ.50 ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామానికి చేరేసరికి ఒక మొక్క ఖర్చు రూ.70 వరకు వస్తుంది. ఎకరాకు 650 మొక్కలు నాటుతారు. సాలుకు, సాలుకు మధ్య ఆరు అడుగులు, మొక్కకు, మొక్కకు మధ్య 9 అడుగుల దూరం ఉండేలా నాటుకుంటున్నారు. ప్రధానంగా పశువుల ఎరువులు, కంపోస్టు ఎరువులు, వేప పిండి వంటి వాటిని వినియోగించాలి. ఐదో ఏడాది నుంచి కాపు వస్తుంది. వక్కకు డ్రిప్ సదుపాయం తప్పనిసరి. ప్రభుత్వం ఏపీఎంఐపీ ద్వారా 5 ఎకరాల్లోపు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ మంజూరు చేస్తోంది.

ఎకరాకు రూ.10 లక్షలకు పైగా ఆదాయం

అవగాహనతో సాగు చేస్తే వక్క లాభాల పంట పండిస్తుంది. ఐదు నుంచి ఏడెనిమిదేళ్ల వరకు ఒక్కో చెట్టుకు రెండు నుంచి మూడు కిలోల వరకు దిగుబడి వస్తుంది. ఎకరా భూమిలో 650 మొక్కలు ఉంటున్నందున ఎకరాకు 13 – 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కాపు మొదలైన తర్వాత నాలుగు నెలల పాటు వస్తుంది. చెట్టు నుంచి తెంపిన పచ్చి వక్క క్వింటా ధర రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు ఉంటోంది. అంటే 5వ ఏడాది నుంచే ఎకరాకు రూ.10 లక్షల ఆదాయం పొందే వీలుంది. జిల్లాలో వక్క సాగు చేస్తున్న రైతులు మార్కెటింగ్ సదుపాయాన్ని ముందుగానే నిర్ధారించుకుని సాగుకు శ్రీకారం చుట్టారు. పంటను కోసిన వెంటనే వక్క కంపెనీలే పొలం దగ్గరకు వచ్చి ఆ రోజు ఉన్న ధరతో కొనుగోలు చేయనుండటం విశేషం.



వక్క మొక్క ఇలా..

అధ్యయనం తర్వాతే సాగు



గత జూలైలో 2 ఎకరాల్లో వక్క సాగు చేపట్టాం. కర్ణాటకలో వక్కసాగుపై అధ్యయనం చేశాం. పావుగడ నుంచి తీసుకొచ్చేందుకు ఒక్కో మొక్క ఖర్చు రూ.70 వరకు వచ్చింది. ఎకరాకు 650 చొప్పున రెండు ఎకరాల్లో 1,350 మొక్కలు నాటాం. రెండేళ్ల పాటు అంతర పంటలు వేసుకోవచ్చు. మొదటి ఏడాది మాత్రమే పెట్టుబడి వ్యయం ఎక్కువ. రెండో ఏడాది నుంచి పశువుల ఎరువు తప్ప ఎలాంటి ఖర్చులు ఉండవు. ఐదో ఏడాది నుంచి వక్కలో దిగుబడులు మొదలవుతాయి. ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై సూక్ష్మ సేద్యం సదుపాయం కూడా కల్పించింది.

– రవికుమార్ గౌడు, రామదుర్గం, చిప్పగిరి మండలం

ఆరు ఎకరాల్లో మొక్కలు

ఏటా పత్తి, వేరుశనగ వంటి పంటలే సాగు చేస్తున్నాం. ఈ ఏడాది మొదటి సారి వక్క సాగుకు శ్రీకారం చుట్టాం. నాలుగు నెలల క్రితం ఆరు ఎకరాల్లో ఎకరాకు 600 ప్రకారం 3,600 మొక్కలు నాటాం. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి ఖర్చు వచ్చింది. కర్ణాటకలోని చిత్రదర్గ నర్సరీ నుంచి మొక్కలు తెప్పించాం. పెట్టుబడి, దిగుబడి, ధరలను బట్టి వక్కసాగులో నికరాదాయం ఎక్కువగా ఉంటుందనే నిర్ణయానికి వచ్చిన తర్వాతనే సాగు చేపట్టాం. మార్కెటింగ్ కోసం కంపెనీలతో కూడా మాట్లాడాం.

– శివ, హత్తిబెళగల్, ఆలూరు మండలం

అవగాహన తప్పనిసరి



వక్క సాగుపై పూర్తి అవగాహన పెంచుకున్న తర్వాతే సాగు చేయడం మేలు. ఇక్కడి వాతావరణ పరిస్థితులు వక్క సాగుకు అనుకూలంగా లేవు. అయితే కొంత మంది రైతులు కర్ణాటకలో వక్కసాగును అధ్యయనం చేశారు. ఈ ఏడాది జిల్లాలో ఒకరిద్దరు రైతులు సాగు చేపట్టారు. వీళ్లు బాగా రాణిస్తే మరికొందరు రైతులు వక్క సాగుపై దృష్టి సారించే అవకాశం ఉంది.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

- అక్టోబర్ 2 వరకు పల్లెల్లో స్వచ్ఛతాహి సేవా

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 'స్వచ్ఛతాహి సేవా 2003 ' కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2వ తేదీ మహాత్మా గాంధీ జయంతి వరకు ఈ కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డిని నిర్మించుకునేలా అవగాహన కల్పించి ఆయా గ్రామాలను ఓడీఎఫ్+గా తీర్చిదిద్దుతామన్నారు. ఆయా పంచాయతీల్లో ఎక్కడైనా చెత్త కుండీలు పాడైపోయి ఉంటే కొత్త వాటిని ఏర్పాటు చేయడం, పబ్లిక్ టాయ్‌లెట్స్‌పై స్లోగన్లు రాయడం, కంపోస్టు కిట్స్‌ను క్లీన్ చేయడం, రిక్షాల రిపేర్లు, వాటిపై స్లోగన్స్ తదితర కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామన్నారు. కార్యక్రమాలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాలన్నారు.



కోడుమూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

ఓర్వకల్లులో 41 మి.మీ వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ఓర్వకల్లు మండలంలో భారీ వర్షం కురువగా.. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షపాతం నమోదైంది. ఎనిమిది మండలాల్లో వర్షాలు పడ్డాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నా యి. అత్యధికంగా ఓర్వకల్లులో 41.0 మి.మీ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ నెల సాధా రణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 74.8 మి.మీ వర్షం కురిసింది. ఈ నెలకు సంబంధించి 36 శాతం లోటు వర్షపాతం ఉన్నట్లు స్పష్టమవుతోంది. రానున్న నాలుగైదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. తాజా వర్షాలు రబీ పంటల సాగుకు ఊతం ఇవ్వనున్నాయి.

మంచి చేస్తున్న ప్రభుత్వమే మళ్లీ రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీవై రామయ్య, చిత్రంలో సురేందర్ రెడ్డి తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజలకు అన్ని విధాలుగా మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మళ్లీ రావాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. కర్నూలు, కోడుమూరు, పాణ్యం, పత్తికొండ నియోజకవర్గాల జగనన్న సచివాలయ, మండల కన్వీనర్ల సమావేశం శుక్రవారం కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ మంచి చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అందుకే నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజల కష్టాలు స్వయంగా తెలుసుకున్న ఆయన కేవలం రెండు పేజీల్లోనే మేనిఫెస్టో తెచ్చారని, హామీలను 98శాతం అమలు చేశారన్నారు. హామీల్లో అత్యధిక శాతం అమలు చేసిన చరిత్ర దేశంలో ఎవరికీ లేదని, కేవలం తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలను ఆకర్షిస్తున్నాయని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఇంతటి మేలు చేస్తున్న ప్రభుత్వం, లక్ష్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఇలాంటి ప్రభుత్వం మళ్లీ రావాలని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపిస్తే ఇంతకు మించి మంచి చేస్తారని చెప్పాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్నికల సమీపిస్తుండడంతో మరింత కీలకంగా పనిచేయాలని, పనితీరుపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా దృష్టి సారించినట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన, చేస్తున్న కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, ఏ పార్టీ ఇవ్వని విధంగా పదవులు వచ్చిన ఘనత వైఎస్ఆర్‌సీపీదే అన్నారు. టీడీపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ సమావేశంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ సురేంద్రరెడ్డి, జిల్లా ఫాలోయింగ్ శ్రీనివాసరెడ్డి, పాణ్యం, కర్నూలు, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల్లోని జేసీఎస్ మండల కన్వీనర్లు గోవర్ధన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సుమంత్ కుమార్‌రెడ్డి, మహమ్మద్ హనీఫ్, కేశవరెడ్డి, ప్రసాద్, సతీష్ బాబు, సయ్యద్ అంజాద్, ఎజాజ్ అలీఖాన్ పాల్గొన్నారు.





భక్తా..వెళ్లొస్తా!

ఆదోని పట్టణంలో వినాయక విగ్రహాల ఊరేగింపు, చిన్నహరివాణం సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ వద్ద ఏర్పాటు చేసిన ఘాట్‌లో శుక్రవారం గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): హాలహర్వి మండలం హర్దగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.సురేంద్రబాబును సస్పెండ్ చేసినట్లు జిల్లాపరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయనను సస్పెండ్ చేశామన్నారు. జెడ్పీ, మండల పరిషత్, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడే 'పట్టా'భిషేకం

- స్నాతకోత్సవానికి ట్రిపుల్ ఐటీడీఎంలో ఏర్పాట్లు పూర్తి
- 2019-23లో బీటెక్ పూర్తి చేసిన వారికి పట్టాలు ప్రదానం
- బంగారు పతకాలు అందుకోనున్న ఐదుగురు

కర్నూలు సిటీ: కల సాకారమైంది.. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న శుభతరుణం రానే వచ్చింది. నాలుగేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న యువ ఇంజినీర్లు బీటెక్ పట్టాలు అందుకోనున్నారు. ఇందుకు కర్నూలు సమీపంలోని ట్రిపుల్ ఐటీడీఎం(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్)లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్యాంపస్‌లోని నూతన కృష్ణ సెమినార్ హాలులో ఐదో స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఐఐటీ హైదరాబాద్, రూర్కీ పాలక మండలి అధ్యక్షులు డాక్టర్ బీవీ ఆర్ మోహన్ రెడ్డి, భారతీయ సమాచార రూపకల్పన, తయారీ సంస్థ చైర్మన్ ఆచార్య హెచ్‌ఏ రంగనాథ్ హాజరుకానున్నారు. ఐదో స్నాతకోత్సవంలో 2019–23 బ్యాచ్‌కి చెందిన బీటెక్ విద్యార్థులు 113 మంది, ఎంటెక్ విద్యార్థి ఒకరు పట్టాలు అందుకోనున్నారు. అదే విధంగా వివిధ బ్రాంచ్‌ల్లో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు బంగారు పతకాలు బహూకరించనున్నారు.

ప్రతిష్టాత్మక సంస్థగా..

ఏపీ పునర్విభజన చట్టం-2014 ప్రకారం ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్‌ఐటీ డీఎంను కర్నూలుకు మంజూరు చేశారు. మొదటగా కాంచీపురం(తమిళనాడు)లో మెంటర్ ఇనిస్టిట్యూట్‌గా 2015 ఆగస్టు నెలలో మూడు బీటెక్ కోర్సులతో తరగతులు మొదలయ్యాయి. కాంచీపురం నుంచి 2018లో కర్నూలు తరలించి శాశ్వత క్యాంపస్‌ను ప్రారంభించారు. మొదటగా మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్సు కోర్సులు మాత్రమే ఉండేవి. 2019-20 అకడమిక్ ఇయర్ నుంచి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ డాటా సైన్స్ అనే మరో బీటెక్ కోర్సు, మూడు పీహెచ్‌డీ కోర్సులు ప్రారంభించారు. మొదట క్యాంపస్‌లో 75 బీటెక్ సీట్లు ఉండగా.. నేడు 271కి పెరిగాయి.

వసతుల్లో మేటి

దేశంలోని అన్ని ప్రాంతాలకు అనుగుణమైన వాతావరణం ఉండేలా క్యాంపస్‌ను అన్ని వసతులతో తీర్చిదిద్దారు. 152 ఎకరాల విస్తీర్ణంలోని 60 ఎకరాల్లో భవనాలు నిర్మించారు. క్రీడల కోసం ఇండోర్ స్టేడియం, యోగా, జిమ్‌లు ఏర్పాటు చేశారు. బాస్కెట్‌బాల్ కోర్టు, మినీ క్రికెట్ స్టేడియం సైతం నిర్మిస్తున్నారు. ప్రత్యేకంగా పోస్టల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. 24 గంటల వైఫై సేవలు అందుతున్నాయి. మొదట రూ.218 కోట్లు, తరువాత రూ.256 కోట్లతో పనులు పూర్తి చేశారు. తాజాగా మరో రూ.50 కోట్లు మంజూరయ్యాయి. క్యాంపస్‌లో మొత్తం 11 భవనాలు, ఐదు సెమినార్ హాల్స్ ఉన్నాయి. ఒక మల్టీపర్పస్ హాల్ సేవలు అందిస్తోంది. విద్యార్థుల కోసం డిజిటల్ లైబ్రరీ, 5 వేలకుపైగా పుస్తకాలు, వందలాది పరిశోధన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. దేశంలో ఉన్నటువంటి 25 ట్రిపుల్ ఐటీల్లో కర్నూలు ట్రిపుల్‌డీఎం మేటిగా నిలుస్తోంది.



జగన్నాథగట్టుపై నిర్మించిన ట్రిపుల్ ఐటీడీఎం భవనం

కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగం

ట్రిపుల్ ఐటీడీఎంలో కోర్సు పూర్తి అయిన వారిలో 80 శాతం మందికి ఉద్యోగాలు వచ్చాయి. దీపక్ రాథోర్ అనే విద్యార్థి అత్యధికంగా ఏడాదికి రూ.1.36 కోట్ల వార్షిక వేతనంతో అమెజాన్‌లో ఉద్యోగం పొందారు. సరాసరి రూ.9.52 లక్షల వార్షిక వేతనం పొందే ఉద్యోగాలు చాలా మందికి వచ్చాయి. ఎంటెక్ చదివిన వారిలో 100 శాతం మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పొందారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్స్ ఆటోమేషన్ విభాగాలలో 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఎంటెక్ కోర్సులు ప్రారంభించనున్నారు. ఎంటెక్ రెండు సంవత్సరాల్లో ఏదైనా ఒక సంవత్సరం నార్వేలో చదివేందుకు నార్వే ఆగ్డర్ యూనివర్సిటీతో ట్రిపుల్ ఐటీడీఎం ఒప్పందం చేసుకుంది.

పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యం



సంస్థలో పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నాం. నాలుగేళ్లలో 30 రీసెర్చ్ ప్రాజెక్టులు సాధించాం. దీంతో పాటు కర్నూలులోని పలు ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థులకు రోబోల తయారీపై శిక్షణను ఇస్తున్నాం. వచ్చే నెల చివరి నాటికి క్యాంపస్‌లో 100 శాతం పనులు పూర్తవుతాయి.

– ఎల్ఎస్‌పీ సోమయాజులు, ట్రిపుల్ ఐటీ డీఎం, డైరెక్టర్

క్లుప్తంగా

వినాయకుడికి చాక్లెట్ మాల



పాణ్యం: వినాయకుడికి చాక్లెట్ మాల వేసి ఓ భక్తుడు తన భక్తి భావాన్ని చాటుకున్నాడు. పాణ్యం గ్రామానికి చెందిన ఎల్లప్ప తమ కాలనీలో కొలుదీరిన విఘ్నేశ్వరుడికి పూలమాలకు బదులు 730 చాక్లెట్లతో దాదాపు రెండు గంటలు కష్టపడి మాల తయారు చేయించారు. ఈ మాలను శుక్రవారం వినాయకుడి మెడలో వేశారు. నిమజ్జనానికి విగ్రహాలను తరలించేలోపే పిల్లలు ఈ మాలను తీసుకునేందుకు ఎగబడ్డారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- పది మందికి గాయాలు

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని విక్టోరియా పేటలో శుక్రవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గుజరాతీ పాఠశాల సమీపంలో పది మందిని కరవడంతో హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలివచ్చారు. స్థానికులు వెంటనే పిచ్చి కుక్కను చంపి వేశారు. గాయపడిన వారిలో సద్దాంహుసేన్, దివ్యాంగురాలు సుజాత, విశ్వనాథ్‌తో పాటు ఏడుగురు ఉన్నారు.

గాయపడిన బాలుడి మృతి



మృతుడు చాకలి మనోజ్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: వినాయకుడిని ఊరేగిస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి ఢీ కొట్టడంతో గాయపడిన మనోజ్ (8) చికిత్సపొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. ఎమ్మిగనూరు పట్టణం ఎస్ఎంటీ కాలనీకి చెందిన వెంకటేష్, హేమలతకు ధనుష్, మనోజ్(8) సంతానం. వెంకటేష్ జీపు డ్రైవర్‌గా పనిచేస్తూ ఏడాది క్రితం తిరుపతి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హేమలత ఆశా వర్కర్‌గా పనిచేస్తూ తన ఇద్దరు కుమారులను చదివిస్తోంది. మనోజ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఇద్దరు అన్నదమ్ములు గురువారం రాత్రి వినాయక చవితి వేడుకల్లో ఉండగా వినాయకుడి విగ్రహం ఉండే బొలెరో వాహనం అదుపు తప్పి వీరిని ఢీ కొట్టింది. మనోజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. సంతోషంగా గంతులేస్తున్న ఇద్దరు కుమారుల్లో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయాలు పాలు కావటంతో తల్లి హేమలత తల్లడిల్లిపోతోంది. ప్రమాదానికి కారకుడైన బోయ మహేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ బాబు విలేకరులకు తెలిపారు.

డోన్ పాతపేటలో చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేటలోని పెద్దమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న కిరాణం కొట్టు వ్యాపారి అలంపూర్ రామయ్య ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. వ్యక్తిగత పనుల నిమిత్తం రామయ్య, అతని భార్య గురువారం ఇంటికి తాళం వేసి నంది కొట్కూరులోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసిన విషయాన్ని గమనించిన దొంగలు రాత్రి ఇంటిలోకి చొరబడి బీరువాలో 12 తులాల బంగారం, రూ. 40 వేల నగదును అపహరించారు. శుక్రవారం ఉదయం ఇంటి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటాన్ని స్థానికులు గమనించి రామయ్యకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి దొంగల ఆచూకీ కోసం ఆధారాలు సేకరించారు.



ఓర్వకల్లు: నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకుడు



ఆదోని: నిమజ్జనోత్సవాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



ఆదోని: నీటి పంపిణీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



కోసిగి: ఊరేగింపుగా వెళ్తున్న మట్టి గణనాథుడు

ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయ్యా!



కోవెలకుంట్ల: పట్టణంలో వినాయక విగ్రహాల ఊరేగింపు



బనగానపల్లె మండలం కైప గ్రామంలోని చెరువులో నిమజ్జన దృశ్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలుచోట్ల శుక్రవారం నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఆనందోత్సవాల మధ్య స్వామివారి విగ్రహాలను ఊరేగించారు. సమీపంలోని జలాశయాల్లో లంబోదరులను నిమజ్జనం చేశారు. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటివ్వకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



నంద్యాల: వేలంలో లడ్డూ దక్కించుకున్న భక్తుడు



నంద్యాల: బాలికల ఆనంద హేల



కోసిగి: ఊరేగింపులో తలపాగాలతో మహిళలు



బనగానపల్లె: పెండేకంటి నగర్ కాలనీలో కళ్లకు గంతలతో ఉట్టికొడుతున్న మహిళ

గణేశ్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



సమావేశానికి హాజరైన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు

కర్నూలు(సెంట్రల్): నగరంలో ఈ నెల 26న గణేశ్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో ఆమె సమీక్షించారు. ప్రస్తుతం సుంకేసుల బ్యారేజీలో 1 టీఎంసీ నీరు మాత్రమే ఉందని, ఇందులో నిమజ్జనం కోసం 0.2 టీఎంలను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. నీటిలో వ్యర్థాలను పడేయకుండా భక్తులు సహకరించాలని కోరారు. ఈనెల 25వతేదీలోపు బారికేడ్ల పనులు పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పాతబస్టాండ్ నుంచి వినాయక ఘాట్ వరకు ప్రతి అర్ధ కిలోమీటర్‌కు మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ డాక్టర్ బి.రామగిడ్డయ్యకు సూచించారు. అలాగే రెండు అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లను సిద్ధం చేసుకోవాలని మత్స్య శాఖ జేడీ శ్యామలను ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనం కోసం 9 క్రేన్లను ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజకు సూచించారు. అదనపు ఎస్పీ టి.సర్కార్ మాట్లాడుతూ.. నిమజ్జన సమయంలో 1,548 మందితో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీజే స్పీకర్ల శబ్దాన్ని 10 నుంచి 15 నిమిషాలకు ఒకసారి తగ్గిస్తే పోలీసు కమ్యూనికేషన్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. క్రేన్ల వద్ద రిపేరు చేసే మెకానిక్‌లు ఉండేలా చూడాలన్నారు. నిమజ్జనం సందర్భంగా విద్యుత్ సరఫరాలో కొన్ని చోట్ల అంతరాయం ఉండవచ్చని, ఇందుకు ప్రజలు సహకరించాలని విద్యుత్ ఎస్ఈ ఉమాపతి ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, డీఆర్వో మధుసూదనరావు, గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న, నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షుడు హరీష్‌బాబు, జిల్లా సమన్వయ కార్యదర్శి నాగఫణి శాస్త్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, కోశాధికారి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌కు మాతృవియోగం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ శుక్రవారం మృతి చెందారు. శనివారం ఉదయం 10.30 గంటలకు చిత్తూరు జిల్లా నింద్ర మండలం కొప్పేడు గ్రామంలో అంత్యక్రియలు జరుగనున్నాయి. ధర్మకర్తల మండలి చైర్మన్ మాతృమూర్తి మృతిపట్ల శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన

- జిల్లా కలెక్టర్ సృజన



వినతులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

కోడుమూరు: 'జగనన్నకు చెబుదాం'లో భాగంగా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే మండల స్థాయిల్లోనూ స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సృజన తెలిపారు. శుక్రవారం కోడుమూరులోని మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై 70 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి జిల్లా, మండల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య, ఆర్డీఓ హరిప్రసాద్, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, కోడుమూరు తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన సమస్యల్లో కొన్ని..

- తన పేరున ఉన్న ఎకరన్నర భూమిని 2017లో వేరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారని కోడుమూరు మండలం గోరంట్ల గ్రామానికి చెందన భోగేశ్వరరెడ్డి ఫిర్యాదు చేశారు.
- తమ పొలాలకు సాగునీరందించి ఆదుకోవాలని పులకుర్తి, కల్లపరి గ్రామాలకు చెందిన రైతులు విన్నవించారు.
- కోడుమూరు మోడల్ స్కూల్‌కు రహదారి సౌకర్యం కల్పించాలని, బీసీ బాలుర వసతి గృహానికి మరమ్మతులు చేయించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

- యువజనోత్సవాల్లో మేయర్ బీవై.రామయ్య



కార్యక్రమానికి హాజరైన యువతీ యువకులు



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు(హాస్పిటల్): స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కర్నూలు నగర మేయర్ బీ.వై. రామయ్య అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బి.క్యాంపులోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీలను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల యువతలో ఆత్మస్థైర్యం మరింత పెరుగుతుందన్నారు. ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ కార్యక్రమంలో ఇంత మంది విద్యార్థినులు, మహిళలు పాల్గొనడం శుభపరిణామమన్నారు. సెట్కూరు సీఈవో పీవీ రమణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువ కళాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ముందుగా జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా స్థాయి విజేతలతో రాష్ట్రస్థాయి, తదుపరి రాష్ట్రస్థాయి విజేతలతో జాతీయ స్థాయి పోటీలు ఏదో ఒక రాష్ట్రంలో నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యకుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలు..

జానపద నృత్యం(గ్రూప్) : ప్రత్యూష గ్రూప్, సిల్వర్‌జూబ్లీ కళాశాల, కర్నూలు, సమీరా గ్రూప్, ఏపీ మోడల్ స్కూల్, కృష్ణగిరి, దేవిశ్రీ గ్రూప్, ప్రభుత్వ బీఈడీ కళాశాల

జానపద నృత్యం(సోలో) : ధరణి, రమ్య, లక్ష్మీకాంతమ్మ

జానపద గీతం (గ్రూప్): ప్రవల్లిక గ్రూప్, కీర్తన గ్రూప్, లీలావతి గ్రూప్

జానపద గీతం(సోలో) : ఇ.జ్యోతి, బి. సచిన్, బి.లక్ష్మీదేవి

ఫొటోగ్రఫీ : కుల్దీప్ నారాయణ్, బి.చరిత, షోయబ్ అక్తర్

జీవాలను సంతకు తరలిస్తుండగా..

- మందపైకి దూసుకెళ్లిన లారీ
- 15 జీవాలు మృతి



మృతి చెందిన జీవాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: యాగంటిపల్లె గ్రామ సమీపంలో జీవాల మందపై లారీ దూసుకెళ్లడంతో 15 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఫతేనగర్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తి సుమారు వంద జీవాల మందను శుక్రవారం తెల్లవారుజామున బనగానపల్లెలో జరిగే సంతలో విక్రయించేందుకు బయలుదేరాడు. యాగంటిపల్లె సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే బనగానపల్లె నుంచి ప్యాపిలి వైపు అతివేగంగా వస్తున్న మహా సిమెంట్ సంస్థకు చెందిన లారీ జీవాల మందపై దూసుకెళ్లింది. లారీ టైర్ల కింద పడ్డ 15 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఐదు జీవాలకు తీవ్ర గాయాలయ్యాయి. జీవాలపై దూసుకెళ్లిన లారీ రోడ్డు పక్కనే నిలిపిన కారును సైతం ఢీ కొట్టింది. దీంతో కారు సైడ్ భాగం పూర్తి దెబ్బతినింది. తెల్లవారుజామున లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని జీవాల యజమాని కృష్ణమూర్తి తెలిపాడు. విషయం తెలుసుకున్న బనగానపల్లె ఎస్ఐ రామిరెడ్డి వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని మృతి చెందిన జీవాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.